సాక్షి నిర్మల్

గురువారం । 10 । ఆగస్టు । 2023



వర్క్‌స్పేస్‌ను వినియోగించుకోవాలి

వర్క్‌స్పేస్‌ను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర మంత్రి కేటీఆర్ ట్రిపుల్ఐటీ విద్యార్థులకు సూచించారు. నిజామాబాద్ ఐటీ హబ్‌లో ఏర్పాటు చేసిన వర్క్‌స్పేస్‌ను బుధవారం ప్రారంభించారు. 8లో▸

డీసీసీ అధ్యక్షుడిగా శ్రీహరిరావు



నిర్మల్: డీసీసీ అధ్యక్షుడిగా కూచాడి శ్రీహరిరావును నియమిస్తూ బుధవారం రాత్రి ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ పత్రిక ప్రకటన చేశారు. తెలంగాణ ఉద్యమనేతగా, బీఆర్ఎస్ పశ్చిమజిల్లా అధ్యక్షుడిగా పనిచేసిన కూచాడి జూన్‌లో కాంగ్రెస్‌లో చేరారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 32.0 / 24.0

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న అజేశ్‌కుమార్

నిర్మల్‌టౌన్: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి అజేశ్‌కుమార్ సూచించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ట్రైబల్ వెల్ఫేర్ బాలుర పాఠశాలలోని విద్యార్థులకు బుధవారం న్యాయపరమైన చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రాజ్యాంగంలోని న్యాయపరమైన చట్టాలను వివరించారు. సైబర్ చట్టాలు, యాసిడ్ దాడులు, బాల్యవివాహాలు, గృహహింస చట్టం, నిర్వహణ చట్టం, యాసిడ్ దాడులు, ట్రైబల్ రైట్స్‌కు సంబంధించిన న్యాయ సేవలపై అవగాహన కల్పించారు. బాలికల చట్టాలను ఎలా వినియోగించుకోవాలో వివరించారు. నిర్మల్ చీఫ్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ రాజలింగం, న్యాయవాది లింగాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'మాస్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్'

నిర్మల్‌చైన్‌గేట్: బోదకాలు నిర్మూలనకు జిల్లాలో గురువారం నుంచి అన్ని గ్రామాలు, పట్టణాల్లో మాస్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌వో ధనరాజ్ ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమ నిర్వహణకు 1,620 బృందాలను నియమించినట్లు పేర్కొన్నారు. ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు బూత్ స్థాయిలో, 13నుంచి 22వ తేదీ వరకు ఇంటింటికీ వెళ్లి మాత్రలు మింగించే కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇంకా ఎవరైనా మిగిలితే 23, 24 తేదీల్లో కార్యక్రమం ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఇందుకు అవసరమైన మందులు, ఇతర సామగ్రి పీహెచ్‌సీలకు పంపించినట్లు తెలిపారు.


జిల్లా కేంద్రంలో 'ఇంటింటికీ బీజేపీ'



వృద్ధురాలితో మాట్లాడుతున్న మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: పట్టణంలోని బేస్తవార్‌పేట్, కాల్వగడ్డ కాలనీల్లో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి గడపగడపకూ తిరిగారు. కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. బీజేపీని ఆదరించాలని కోరారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రాగానే స్థానిక మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి చేసిన కబ్జా భూములు స్వాధీనం చేసుకొని అర్హులైన పేదప్రజలకు పంచుతామని హామీ ఇచ్చారు. నాయకులు అయ్యన్నగారి భూమయ్య, మెడిసెమ్మ రాజు, సామ రాజేశ్వర్‌రెడ్డి, వొడిసెల శ్రీనివాస్, వొడిసెల అర్జున్, కమల్ నయన్, భూపతిరెడ్డి, అరవింద్, విలాస్, రాకేశ్, నాని, నరేశ్, గంగారెడ్డి, భాస్కర్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

'దేవరకోట' ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న చైర్మన్, డైరెక్టర్లు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని పురాతన దేవరకోట శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ నూతన పాలక మండలి సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. రాష్ట్ర మంత్రి ఐకేరెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కాగా, చైర్మన్ ఆమెడ శ్రీధర్, డైరెక్టర్లు అయ్యన్నగారి శ్రీనివాస్, దేవేందర్‌గౌ డ్, సీహెచ్ గంగాధర్, జాప అనిల్, దార్ల సునీత- రాజేశ్వర్, డాక్టర్ యూ రామకృష్ణ, ఎస్.నవీన్‌కుమార్ తదితరులతో ఆలయ అధికారులు ప్రమాణ స్వీకారం చేయించారు. అంతకుముందు మంత్రి ఆలయంలో పూజలు చేసి ఆవరణలో మొక్క నాటారు. ఆయన మాట్లాడుతూ.. రూ.1.20 కోట్లతో దేవరకోట ఆలయాన్ని అభివృద్ధి చేసినట్లు చెప్పారు. అనంతరం నూతన చైర్మన్, డైరెక్టర్లను సన్మానించి అభినందించారు. 68 మంది పురోహితులకు ధూపదీప నైవేద్యం ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి-రాంకిషన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు రాము, నాయకులు రాంచందర్, గౌతమ్‌రెడ్డి, కిషన్, రామేశ్వర్‌రెడ్డి, అధికారులు నవీన్‌కుమార్, రవికిషన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'ముధోల్'లో కొత్తముఖాలు



- కాంగ్రెస్ నుంచి ముగ్గురు ఆశావహులు
- బీఆర్ఎస్‌లోనూ ఎమ్మెల్యే, మరొకరు..!
- బీజేపీలో ఐదుగురు నాయకుల ఆసక్తి
- ఎన్నికల సమీపిస్తుండగా రసవత్తరంగా నియోజకవర్గ రాజకీయాలు

నిర్మల్: ముధోల్ నియోజకవర్గ రాజకీయాలు రోజురోజుకూ మారుతున్నాయి. నియోజకవర్గ రాజకీయ, సామాజిక పరిస్థితులను బట్టి రానున్న ఎన్నికల్లో ఇక్కడినుంచి పోటీ చేసేందుకు కొత్తముఖాలు తెరపైకి వస్తున్నాయి. స్థానిక సీనియర్లతో పాటు ఇతర నియోజకవర్గ నేతలూ ఇక్కడి నుంచి పోటీకి సన్నద్ధమవుతున్నారు. రానున్న ఎన్నికల్లో తమ రాజకీయ భవిష్యత్‌ను పరీక్షించుకుంటామంటున్నారు. కొత్తవాళ్లతో పాటు గతంలో ఎమ్మెల్యేలుగా చేసిన మాజీలూ బరిలో దిగేందుకు సై అంటున్నారు. ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిపై వ్యతిరేకత పెరుగుతున్న క్రమంలో సొంతపార్టీ నేతలే ముందుకు వచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ఏ దిక్కు లేకుండా ఉన్న కాంగ్రెస్ కొత్త ముఖాలను రంగంలోకి దింపేందుకు యోచిస్తోంది. బీజేపీలో మాత్రం భిన్నమైన పరిస్థితి. పార్టీ టికెట్ కోసం తీవ్రమైన పోటీ నెలకొంది. అలాగే మాజీ ఎమ్మెల్యేలు నారాయణరావు పటేల్, వేణుగోపాలాచారి కూడా బరిలో దిగే అవకాశాలున్నట్లు వారి అనుచరులు చెబుతున్నారు.

ఖాళీగా కాంగ్రెస్..

కర్ణాటక ఎన్నికల్లో గెలుపుతో రాష్ట్రంలోనూ ఒక్కసారిగా కాంగ్రెస్ పుంజుకుంది. కానీ.. జిల్లాలో విచిత్రంగా ఏళ్లుగా ఉన్న బలమైన నేతలందరినీ కోల్పోయింది. ఏఐసీసీ నేత మహేశ్వర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు రామారావుపటేల్ బీజేపీలో చేరారు. చాలామంది సీనియర్లూ వారివెంటే వెళ్లిపోవడంతో కాంగ్రెస్ ఖాళీ అయ్యింది. ప్రస్తుతం ముధోల్ నియోజకవర్గం నుంచి ఆనంద్‌రావు పటేల్ మాత్రమే సీనియర్ నేతగా ఉన్నారు. ముధోల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఎవరనే విషయాన్ని ఇప్పటికీ ఖరారు చేయకుండా కాంగ్రెస్ వేచిచూసే ధోరణిలో ఉంది. కొందరు కొత్తనేతల పేర్లను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

బీజేపీలో తీవ్ర పోటీ..

బీజేపీ టికెట్ కోసం ఎక్కడా లేనంత తీవ్రమైన పోటీ ముధోల్‌లో ఉంది. గతంలో రెండుసార్లు పోటీచేసి ఓడిన జిల్లా అధ్యక్షురాలు రమాదేవి, డీసీసీ అధ్యక్షుడిగా ఉండి కమలదళంలో చేరిన రామారావుపటేల్, నియోజకవర్గ సీనియర్‌నేత మోహన్‌రావుపటేల్ పార్టీ టికెట్ కోసం తీవ్రంగా శ్రమిస్తున్నారు. పోటాపోటీగా ఈ ముగ్గురూ గ్రామాల్లో ప్రచారం చేసుకుంటున్నారు. వీరితో పాటు ఎన్ఆర్ఐగా ఉండి వచ్చిన యువనేత బాజీరావు పటేల్, బద్దం భోజారెడ్డి కూడా తమ పేర్లను పార్టీ పరిశీలిస్తుందని ఆశిస్తూ ప్రజల్లోకి వెళ్తున్నారు.



రాజేశ్‌బాబు: ముధోల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ సీనియర్‌నేతగా పేరున్న ప్రస్తుత భైంసా ఏఎంసీ చైర్మన్ జాదవ్ రాజేశ్‌బాబు ఈసారి బరిలో దిగేందుకు సిద్ధమవుతున్నారు. ఒకవేళ ప్రస్తుత ఎమ్మెల్యేకు టికెట్ ఇవ్వని పక్షంలో రెండోపేరుగా తనను పరిశీలనలోకి తీసుకోవాలని బీఆర్ఎస్ పెద్దలను కోరినట్లు తెలిసింది. ఇక అసెంబ్లీలో ఓడినా.. తను ముందునుంచీ ఆశిస్తున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఇది అనుభవంగా మారుతుందన్న యోచనలో ఉన్నారు.



తుల అరుణ్‌కుమార్: బోథ్ నియోజకవర్గానికి చెందిన దివంగత సీనియర్ నేత తుల సుభాష్ తనయుడు తుల అరుణ్‌కుమార్‌కు ఈసారి ముధోల్ టికెట్ ఇవ్వాలన్న యోచన కాంగ్రెస్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. బోథ్ ఎస్టీ నియోజకవర్గం కావడంతో అక్కడ ఆయన పోటీచేసే పరిస్థితి లేదు. దానికి తోడు ఆయన సామాజికవర్గమైన మున్నూరుకాపులు ముధోల్ నియోజకవర్గంలో ఎక్కువగా ఉన్నారు. ఇప్పటి వరకు ముధోల్‌లో కాంగ్రెస్‌కంటూ పెద్దదిక్కు లేకపోవడంతో అరుణ్ పేరును ఇక్కడి నుంచి పరిశీలిస్తున్నట్లు చెబుతున్నారు.



డా.కిరణ్‌కుమార్: కిరణ్ ఫౌండేషన్ పేరిట ఇప్పటికే ముధోల్ నియోజకవర్గంలో సేవలు చేస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్ కూడా కాంగ్రెస్‌లో చేరేందుకు సుముఖంగా ఉన్నారు. ఇటీవల శ్రీహరిరావుతో కలిసి ఆయన హైదరాబాద్‌లో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని కలిశారు. అవకాశమిస్తే ముధోల్ నుంచి బరిలో దిగేందుకు సిద్ధమంటున్నారు.



విజయ్‌కుమార్‌రెడ్డి: గతంలో పీఆర్పీ టికెట్ ఆశించి భంగపడ్డ ఎన్ఆర్ఐ విజయ్‌కుమార్‌రెడ్డి ఈసారి పోటీకి రెడీ అవుతున్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పనిచేసిన ఆయన ప్రస్తుతం కాంగ్రెస్‌లోనే కొనసాగుతున్నారు. ఈసారి ఆయన కూడా పార్టీ టికెట్ ఆశిస్తున్నారు.

'కారు'లో కిరికిరి..

ఎన్నికలు సమీపిస్తున్నవేళ హ్యాట్రిక్ కొడదామన్న ఆశల్లో ఉన్న బీఆర్ఎస్‌కు సొంతపార్టీలోనే అసమ్మతి పెరుగుతుండటం మింగుడు పడటం లేదు. పార్టీకి తాము వ్యతిరేకం కాదని, ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిని మాత్రం మార్చాలని సదరు అసమ్మతి నేతలు కొత్త రాగం వినిపిస్తున్నారు. ప్రస్తుత, మాజీ జెడ్పీటీసీ సభ్యులు, కొందరు సీనియర్ నాయకులు ఈ అసమ్మతి వర్గంలో ఉండటం గమనార్హం. వీరందరూ ఇటీవల పార్టీ రాష్ట్ర నేతలను కలిసి ఎమ్మెల్యేపై ఫిర్యాదులు చేశారు. అలాగే మండలాల వారీగా తిరుగుతూ సమావేశాలు నిర్వహిస్తున్నారు. వీరి వెనుక ఎవరున్నారన్న చర్చ నియోజవర్గంలో కొనసాగుతోంది. ఏదిఏమైనా మళ్లీ ఎమ్మెల్యేగా విఠల్‌రెడ్డి గెలుస్తారని ఆయన వర్గం చెబుతోంది.

జాతీయ పురస్కారానికి సిఫారసు



ఎల్లన్నను అభినందిస్తున్న డీఈవో రవీందర్‌రెడ్డి

కుంటాల: మండలంలోని పెంచికల్‌పాడ్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ప్రధానోపాధ్యాయుడు మాదరి ఎల్లన్న గ్రామస్తులు, దాతల సహకారంతో అభివృద్ధి చేశారు. దీంతో గ్రామస్తులు పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపడం మానేశారు. విద్యాప్రమాణాల పెంపు, సమగ్ర అభివృద్ధి ద్వారా రాష్ట్ర విద్యా పరిశోధన.. శిక్షణ సంస్థ, జాతీయ విద్యాపరిశోధన సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన సర్వేలో పెంచికల్‌పాడ్ పాఠశాలకు ఇంపాక్ట్, ఇన్ఫ్లుయెన్స్, ఇన్స్పిరేషన్ బుక్‌లో చోటు దక్కింది. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు (రాష్ట్రపతి పురస్కారం-2023) ఎంపికకు కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. దీంతో డీఈవో రవీందర్‌రెడ్డి హెచ్‌ఎం ఎల్లన్నను బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా ఎల్లన్న మాట్లాడుతూ.. గ్రామస్తుల సహకారంతో పాఠశాలలో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నామని, అధికారుల ప్రోత్సాహం, దాతల సహకారంతో ఎంతో గుర్తింపు లభించిందని పేర్కొన్నారు. జాతీయ పురస్కారానికి రాష్ట్ర ప్రభుత్వం సిఫారసు చేయడం సంతోషంగా ఉందని తెలిపారు.

'కడెం'ను ఆధునికీకరించాలి

కడెం: కడెం ప్రాజెక్ట్‌ను ఆధునీకరించాలని ప్రాజెక్ట్ ఆయకట్టు పరిరక్షణ కమిటీ నాయకులు బుధవారం జిల్లా కేంద్రంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి ఆయన నివాసంలో వినతిపత్రం అందజేశారు. ఎలాంటి ప్రమాదం జరగకముందే ఆధునీకరించాలని, ఎగువన కుప్టి ప్రాజెక్ట్ నిర్మించాలన్నారు. అదనపు గేట్లు ఏర్పాటు చేయాలని, కాలువ ద్వారా చెన్నూర్, ప్రాణహిత వరకు నీరందించాలని, ప్రాణహిత వరకు గ్రావిటీ ద్వారా నీరు సరఫరా చేయాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ జలసాధన సమితి అధ్యక్షుడు నైనాల గోవర్ధన్, నాయకులు రాజశేఖర్, సుభాష్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, రాజేశ్వర్, చందు, విజయ్, అశోక్, వెంకట్రాజం, నందునాయక్, ఫసివుల్లా, లక్ష్మణ్, విజయ్ తదితరులున్నారు.

ట్రిపుల్‌ఐటీ వద్ద ఉద్రిక్తత



సంతాపం తెలుపుతున్న వీసీ, సిబ్బంది



విద్యార్థి నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

- పలువురు నాయకుల అరెస్ట్
- బీజేపీ నేతల గృహనిర్బంధం
- బబ్లూకు వీసీ, సిబ్బంది సంతాపం
- బాధిత కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీలో మంగళవారం పీయూసీ-1 విద్యార్థి జాదవ్ బబ్లూ ఆత్మహత్యకు పాల్పడిన నేపథ్యంలో బుధవారం కూడా క్యాంపస్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. టీజేఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు సర్దార్ వినోద్‌కుమార్, వీజేఎస్ రాష్ట్ర కార్యదర్శి పల్లపు తులసీరాం తదితరులు కళాశాలలోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించారు. కాగా, వీరిని ప్రధాన గేటు వద్ద భద్రత సిబ్బంది, పోలీసులు అడ్డుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మరోవైపు నిర్మల్ ఆస్పత్రి వద్ద బబ్లూ మృతదేహాన్ని తరలించేదాకా ఎవరినీ అనుమతించలేదు. బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రమాదేవి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామారావుపటేల్, భోస్లే మోహన్‌రావుపటేల్, ఎన్ఆర్ఐ బాజీరావుభోస్లేతోపాటు పలువురు నాయకులను పోలీసులు హౌస్ అరెస్ట్ చేసి అదుపులోకి తీసుకున్నారు. కాగా, నిర్మల్ ఆస్పత్రి నుంచి బబ్లూ మృతదేహాన్ని తీసుకువెళ్లిన బంధువులు స్వగ్రామమైన సంగారెడ్డి జిల్లా నారాయణ్‌ఖేడ్ మండలం నాగాపూర్ గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. బబ్లూ మృతికి వీసీ వెంకటరమణ, సిబ్బంది కళాశాలలో రెండు నిమిషాలపాటు మౌనం పాటించి సంతాపం తెలిపారు.

రూ.2లక్షల ఎక్స్‌గ్రేషియా

బబ్లూ కుటుంబానికి వీసీ వెంకటరమణ రూ.2లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. ఇకనుంచి విద్యార్థులకు ఆన్‌లైన్ ద్వారా కౌన్సిలింగ్ ప్లాట్‌ఫాం ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. విద్యార్థులు చెప్పుకోలేని విషయాలను తెలుసుకునేందుకు కొత్తగా ముగ్గురు కౌన్సిలర్‌లను నియమిస్తున్నామని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రుల కోసం పది రోజుల్లో ప్రధాన ద్వారం వద్ద ఒక పేరెంట్స్ లాంజ్ ఏర్పాటు చేస్తామన్నారు. బాసర మండలం నుంచి ఎంపికైన 15మంది విద్యార్థులతో కలిసి 'వీసీ మై విలేజ్' ప్రోగ్రాంను నిర్వహిస్తామని చెప్పారు. విద్యార్థులు ఉండే హాస్టళ్లలో 'సలహా' బాక్స్‌లు ఏర్పాటుచేసి 15రోజులకోసారి తెరిచి అందులో విద్యార్థులు లేఖల ద్వారా తెలిపిన సమస్యలు పరిష్కరిస్తామన్నారు. విద్యార్థులు బెదిరింపులకు గురైతే మెయిల్ లేదా ఫోన్ ద్వారా తెలిపినా రక్షణ కల్పిస్తామని తెలిపారు.

భరోసానిచ్చేనా?

ట్రిపుల్‌ఐటీలో ఆత్మహత్యల పరంపర కొనసాగుతూనే ఉంది. అప్పట్లో స్టూడెంట్ గవర్నింగ్ కౌన్సిల్ ఏర్పాటు చేశామని, మెయిల్ పద్ధతిలో విద్యార్థుల అభిప్రాయాలు తెలుసుకుంటున్నామని అధికారులు ప్రకటించారు. జూన్‌లో 48 గంటల వ్యవధిలో విద్యార్థినులు వడ్ల దీపిక, బూర లిఖిత ఆత్మహత్య చేసుకున్న ఘటనలతో దిద్దుబాటు చర్యలు తీసుకుంటామన్నారు. కానీ.. ఆ ఘటనలు జరిగి రెండు నెలలు కాకుండానే పీయూసీ-1 విద్యార్థి జాదవ్ బబ్లూ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వీసీ వెంకటరమణ, డైరెక్టర్ సతీశ్‌కుమార్ దిద్దుబాటు చర్యలు చేపట్టినా ఫలితాలపై సమీక్ష చేయడం లేదనే విమర్శలున్నాయి. తాజాగా బుధవారం మరోసారి ఇదే విషయమై వీసీ వెంకటరమణ కొత్త నిబంధనలు తెరపైకితెచ్చారు. ఇప్పటికైనా నిబంధనలు అమలు చేసి విద్యార్థుల్లో భరోసా నింపాల్సిన అవసరముందని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

'విద్యార్థుల ఆత్మహత్యలకు ప్రభుత్వానిదే బాధ్యత'



రమాదేవిని హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు



రామారావుపటేల్‌ను..

భైంసాటౌన్: బాసర ఆర్జీయూకేటీ విద్యార్థుల ఆత్మహత్యలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ట్రిపుల్‌ఐటీ విద్యార్థి జాదవ్ బబ్లూ ఆత్మహత్య ఘటన నేపథ్యంలో బీజేపీ నాయకులు ఆర్జీయూకేటీని సందర్శించనున్నారన్న సమాచారంతో జిల్లా అధ్యక్షురాలు రమాదేవి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పవార్ రామారావుపటేల్, భోస్లే మోహన్‌రావు పటేల్‌ను పోలీసులు బుధవారం గృహనిర్బంధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ట్రిపుల్‌ఐటీ విద్యార్థుల ఆత్మహత్యలపై ప్రతిపక్షాలను ప్రశ్నించకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం అక్రమ అరెస్ట్‌లతో గొంతు నొక్కే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. రానున్న రోజుల్లో మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. ట్రిపుల్‌ఐటీ ప్రధానద్వారం వద్ద కాంగ్రెస్ నాయకుడు ఆనంద్‌రావు పటేల్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు.

నిర్మల్ ఖిల్లా: బాసర ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు మానసిక ఒత్తిడితో వరుస ఆత్మహత్యలకు పాల్పడుతున్నా పాలకులు పట్టించుకోకపోవడం దురదృష్టకరమని తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి, టీజేఏసీ జిల్లా చైర్మన్ ఆరెపల్లి విజయ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం ఆయన జిల్లా కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. వరుస ఆత్మహత్యలు జరుగుతున్నా విద్యార్థులకు భరోసా ఇవ్వలేని స్థానిక మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. విద్యార్థి మృతదేహాన్ని సందర్శించడానికి వెళ్తే పోలీసులు అరెస్ట్ చేసి కేసు నమోదు చేయడమేంటని ప్రశ్నించారు. బాధ్యత కలిగిన పౌరుడిగా మానవత దృక్పథంతో పరామర్శించడానికి వెళ్తే అరెస్ట్ చేయడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రిపుల్‌ఐటీలో విద్యార్థులకు సరైన వసతులు కూడా లేవని, బోధన సిబ్బంది కొరత వేధిస్తోందని మండిపడ్డారు. విద్యార్థులు మానసిక సంఘర్షణకు గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నా, దిద్దుబాటు చర్యలు లేవని ఆరోపించారు. వారికి సరైన కౌన్సిలింగ్ ఇప్పించాలని కోరారు. ఇప్పటికైనా సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాయకులు రామ్‌లక్ష్మణ్, బక్కన్న, పాల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నుంచి ఇద్దరి సస్పెన్షన్

నిర్మల్‌టౌన్: బీఆర్ఎస్ నుంచి ఇద్దరిని సస్పెండ్ చేస్తున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు, ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పార్టీ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన నిర్మల్ మున్సిపల్ తొమ్మిదోవార్డు కౌన్సిలర్ అయ్యన్నగారి రాజేందర్, మేడిపల్లి మాజీ ఎంపీటీసీ ప్రవీణ్‌రెడ్డిని క్రమశిక్షణ చర్యల్లో భాగంగా పార్టీ నుంచి సస్పెండ్ చేశామని పేర్కొన్నారు. కాగా, నాలుగుసార్లు మున్సిపల్ కౌన్సిలర్‌గా గెలిచిన తనకు పార్టీలో సముచిత స్థానం దక్కకపోవడంతో పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ఆయన్నగారి రాజేందర్ ప్రకటించడం గమనార్హం. ఈ నెల 23న మాజీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరనున్నట్లు ఆయన వెల్లడించారు.

ఉమ్మడి జిల్లా ఫుడ్‌సేఫ్టీ అధికారుల నియామకం

ఆదిలాబాద్‌టౌన్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఫుడ్‌సేఫ్టీ అధికారులను నియమిస్తూ ఫుడ్‌సేఫ్టీ అండ్ స్టాండర్డ్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. వైద్యారోగ్య శాఖలో పనిచేస్తున్న వైద్యాధికారులకు అదనపు బాధ్యతలు అప్పగించింది. ఆదిలాబాద్ ఫుడ్‌సేఫ్టీ అధికారిగా డాక్టర్ ఎం.శ్రీధర్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా అధికారిగా నేహ తబస్సుమ్, నిర్మల్ జిల్లా అధికారిగా డాక్టర్ శ్రీనివాస్, మంచిర్యాల జిల్లా అధికారిగా వాసురామ్‌ను నియమించింది.

ఆదివాసీల సంక్షేమానికి కృషి

- రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి
- ఘనంగా ఆదివాసీ దినోత్సవం



కొమురంభీం, రాంజీగోండు విగ్రహాలకు పూలమాలవేసి నివాళులర్పిస్తున్న మంత్రి ఐకేరెడ్డి

నిర్మల్‌టౌన్: ఆదివాసీల సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా బుధవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు. కొమురంభీం, రాంజీగోండు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆదివాసీల జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నిర్మల్‌లో బంజారా భవన్ నిర్మాణానికి రూ.2కోట్లు కేటాయించామని తెలిపారు. కలెక్టర్ వరుణ్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, గ్రంథాలయ చైర్మన్ రాజేందర్, ఎఫ్ఎస్సీఎస్ చైర్మన్ ధర్మాజీ రాజేందర్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు రాము, నాయకులు పాకాల రాంచందర్, గోవు గోపి, నెల్ల అరుణ్‌కుమార్, ఆదివాసీలు పాల్గొన్నారు.

నిర్మల్‌చైన్‌గేట్: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని జిల్లా కేంద్రంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కొమురంభీం, రాంజీగోండ్ విగ్రహాలకు బీజేపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి సేవలు కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు అయ్యన్నగారి భూమయ్య, మెడిసెమ్మ రాజు, భూపతిరెడ్డి, అరవింద్, గంగారెడ్డి, రాకేశ్, అలివేలుమంగ, సూరి, సంతోష్, నారాయణ్‌రెడ్డి, రజిని, భాస్కర్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

ఆడబిడ్డలకు అండగా కేసీఆర్



చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్‌టౌన్: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లాంటి ఎన్నో సంక్షేమ పథకాలతో సీఎం కేసీఆర్ ఆడబిడ్డలకు అండగా నిలిచారని రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో బుధవారం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. నిర్మల్ మండలానికి చెందిన 94మంది, దిలావర్‌పూర్‌కు చెందిన 56మంది, సారంగపూర్‌కు చెందిన 36మంది, మామడ మండలానికి చెందిన 24 మంది లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక సీఎం కేసీఆర్ బాలికల విద్య కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, ఎఫ్ఎస్సీఎస్ చైర్మన్ ధర్మాజీ రాజేందర్, ఎంపీపీ రమేశ్వర్‌రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ రాజేందర్, ఏఎంసీ చిలుక రమణ, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు రాము, నాయకులు రాంచందర్, గౌతంరెడ్డి, మురళీధర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సోన్‌లో గోదాం ప్రారంభం

సోన్: మండల కేంద్రంలో పీఏసీఎస్ గోదాం, కార్యాలయాన్ని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఏడీసీసీ చైర్మన్ భోజారెడ్డితో కలిసి బుధవారం ప్రారంభించారు. అనంతరం రైతువేదికలో 49మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఏడీసీసీ ఉపాధ్యక్షుడు రఘునందన్‌రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు అంపోలి కృష్ణప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీ జీవన్‌రెడ్డి, ఎఫ్ఏసీఎస్ చైర్మన్ రాజేందర్, అశోక్, ఎంపీడీవో మోహన్‌రెడ్డి, తహసీల్దార్ శివరాజ్, సీఐ నవీన్‌కుమార్, ఎస్సై రవీందర్, ఏఎంసీ డైరెక్టర్ బుచ్చన్న, ప్రజాప్రతినిధులు, నాయకులున్నారు.

తాత్కాలికంగా సమ్మె విరమణ

నిర్మల్‌చైన్‌గేట్: గ్రామపంచాయతీ కార్మికుల జేఏసీ పిలుపు మేరకు పంచాయతీ కార్మికుల సమ్మె తాత్కాలికంగా విరమించినట్లు కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు బొమ్మన సురేశ్ తెలిపారు. ఈ మేరకు డీపీవో శ్రీలతకు బుధవారం వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఇచ్చిన హామీ మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. సమస్య పరిష్కరించకుంటే 15రోజుల తర్వాత సమ్మె కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నర్సయ్య, ఉపాధ్యక్షుడు ఆకాశ్, నాయకులు దేవరావు, మల్లేశ్, శ్రీనివాస్, రవి, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు సర్టిఫికెట్ల పరిశీలన

ఆదిలాబాద్: డీఈఈ సెట్- 2023లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు గురు, శుక్రవారాల్లో ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు హాజరు కావాలని డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.రవీందర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణులైన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన అభ్యర్థులకు జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలలో సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థులు డీఈఈ సెట్ హాల్ టికెట్, ర్యాంక్ కార్డు, ఎస్సెస్సీ, ఇంటర్ మెమోలు, కుల, ఆదాయ, స్టడీ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు.

క్లుప్తంగా

పూసాయిలో రేకుల షెడ్డు దగ్ధం

- రూ.3.50 లక్షల ఆస్తి నష్టం


దగ్ధమైన ఇంటిముందు బాధితుడు అశోక్

జైనథ్(ఆదిలాబాద్): మండలంలోని పూసాయిలో బుధవారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం సంభవించింది. గ్రామానికి చెందిన కొత్తూరి అశోక్ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. భార్య లక్ష్మి, ముగ్గురు పిల్లలతో కలిసి ఇనుప రేకులతో షెడ్డు నిర్మించుకుని అందులో ఉంటున్నాడు. బుధవారం ఉదయం ఎప్పటిలాగే అశోక్ ఆటోకు లక్ష్మి పంటచేనుకు, పిల్లలు బడికి వెళ్లారు. మధ్యాహ్నం సమయంలో ఒక్కసారిగా ఇంట్లోంచి మంటలు రావడంతో గమనించిన స్థానికులు మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినా అప్పటికే పూర్తిగా కాలిపోయింది. ఇంట్లో ఉన్న రూ.50 వేల నగదు, తులం నర బంగారం, ఇంట్లోని సామగ్రి కాలిబూడిదయ్యాయని బా ధితులు వాపోయారు. మొత్తం రూ.3.50లక్షల వరకు ఆస్తినష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నారు. ఆర్ఐ విజయ్ పంచనామా నిర్వహించారు.

జింకపిల్లపై కుక్కల దాడి


జింకను అప్పగిస్తున్న రైతు

లోకేశ్వరం(ముధోల్): మండలంలోని హవర్గ సమీపంలోని పంట చేనులో బుధవారం జింకపిల్లపై కుక్కలు దాడిచేసి గాయపరిచాయి. సమీపంలో వ్యవసాయ పనులు చేస్తున్న రైతులు కుక్కల బారినుండి జింకను కాపాడారు. నిర్మల్ అటవీశాఖ అధికారులకు సమాచారం అందించడంతో బీట్ ఆఫీసర్ అనుపమ జింకను తీసుకెళ్లి నిర్మల్‌లోని గండి రామన్న హరిత వనంలో వదిలిపెట్టారు.

చేప @ 15 కిలోలు


చేపను చూపిస్తున్న మత్స్యకారులు

కుంటాల(ముధోల్): గడ్డెన్నవాగు ప్రాజెక్టులో బుధవారం మత్స్యకారుల వలకు బొచ్చ రకానికి చెందిన 15 కిలోల చేప చిక్కింది. చేప పెద్దగా ఉండడంతో స్థానికులు ఆసక్తిగా తిలకించి సెల్ ఫోన్లలో బంధించారు. కుభీర్ మండలం మర్లగొండకు చెందిన దేవ్‌రావ్ చేపను ముక్కలుగా కోసి ఓలా సంతలో రూ.200కు కిలో చొప్పున విక్రయించాడు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

నార్నూర్: మండలంలోని భీంపూర్‌లో పవార్ రాంచందర్ అనే గిరిజన రైతుకు చెందిన ఆవు విద్యుత్‌షాక్‌తో మృతి చెందింది. బుధవారం గ్రామ శివారులో మేతకు వెళ్లిన ఆవు వ్యవసాయ పొలం వద్ద తెగి కిందపడిన విద్యుత్ తీగకు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఆవు విలువ దాదాపు రూ.60 వేలు ఉంటుందని, నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

బీర సాగు.. లాభాలు బాగు


బీర సాగును చూపిస్తున్న రైతు జీవన్

లాభాలు వస్తున్నాయి

రెండేళ్లుగా వివిధ రకాల కూరగాయలు సాగు చేస్తున్నా. బీరసాగు సులువుగా ఉండడంతో పాటు అధిక దిగుబడి వస్తుంది. ఈ ఏడాది పంటకు మార్కెట్‌లో డిమాండ్ ఉండడంతో లాభాలు అధికంగా వస్తున్నాయి. బీర సాగుకు కర్రలతో పందిరి, జాలి ఏర్పాటు చేయడం ఖర్చుతో కూడుకున్నది. వీటిని హార్టికల్చర్ ద్వారా రాయితీపై అందిస్తే మరింత మంది రైతులు కూరగాయలు సాగు చేసేందుకు ముందుకు వచ్చే అవకాశం ఉంది.

– గుగ్గిల జీవన్, రైతు, తాంసి

- పత్తి, సోయా పంటల సాగుకు స్వస్తి
- కూరగాయల సాగుతో ముందుకెళ్తున్న యువరైతు
- రెండేళ్లుగా బీర సాగులో లాభాలు గడిస్తున్న జీవన్

తాంసి(బోథ్): పత్తి, సోయా పంటలు సాగు చేస్తే ఆశించిన దిగుబడి, ఆదాయం రాకపోవడంతో కూరగాయల సాగుకు శ్రీకారం చుట్టాడు మండల కేంద్రానికి చెందిన గుగ్గిల జీవన్. తాంసి తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఏగా విధులు నిర్వర్తిస్తూనే వ్యవసాయంపై మక్కువతో తనకున్న నాలుగెకరాల్లో రెండేళ్లుగా బీర, అలసంద, వంకాయ, టమాటా, ఆకు కూరలు సాగు చేస్తున్నాడు.

ఎకరాకు రూ.2 లక్షల ఆదాయం

పందిరి విధానంలో బీరసాగుతో ఎకరాకు దాదాపుగా రూ.2 లక్షల వరకు ఆదాయం ఆర్జిస్తున్నాడు. వినియోగదారులకు నాణ్యమైన కూరగాయలు అందించాలనే ఉద్దేశంతో రసాయన ఎరువులు వాడకుండా సేంద్రియ ఎరువులు వాడుతున్నాడు. చీడ పీడల ఉధృతి లేకుండా పంటను కాపాడుతున్నాడు. సాగుకు ఎకరాకు రూ.60వేల నుంచి రూ.75వేల వరకు ఖర్చు చేస్తున్నాడు. ప్రతీరోజు జిల్లా కేంద్రంలోని రైతు బజార్‌లో వినియోగదారులకు నేరుగా బీర కాయలు విక్రయిస్తున్నాడు. రోజుకు 40 నుంచి 50 కిలోల బీరకాయలు మార్కెట్‌కు తరలిస్తూ కిలోకు రూ.70 నుంచి రూ.100 వరకు విక్రయిస్తున్నాడు. సరాసరి రోజుకు రూ.3 వేలు నెలకు రూ.90వేల చొప్పున సంపాదిస్తున్నాడు. మూడు నెలలపాటు పంట దిగుబడి వస్తుందని, ఎకరాకు రూ.2.50 లక్షల వరకు ఆదాయం వస్తుందని చెప్తున్నాడు. కూరగాయల సాగులో ప్రత్యేక దృష్టి సారిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని పేర్కొంటున్నాడు.

పందిరి విధానంలో బీర సాగు

అందరిలా కాకుండా పందిరి సాగు పద్ధతిలో బీర సాగు చేపడుతున్నాడు. విత్తనాలు మొలకెత్తిన వెంటనే తీగల వద్ద కర్రలను ఏర్పాటు చేశాడు. కర్రలకు చుట్టుకున్న తీగలు కిందపడిపోకుండా వైర్లు ఏర్పాటు చేశాడు. తీగలు పైకి వెళ్లేందుకు ప్రత్యేకంగా జాలి ఏర్పాటు చేశాడు. ఇందుకు రూ.12 వేల వరకు వెచ్చించాడు. ఈ విధానం ద్వారా ఏపుగా పెరిగిన బీర తీగలు అధిక వర్షాలు, ఎండవేడిమికి సైతం దెబ్బతినకుండా అధిక దిగుబడి వస్తుందని ఆయన పేర్కొన్నాడు.

వర్క్‌స్పేస్‌ను వినియోగించుకోవాలి


నిజామాబాద్ ఐటీహబ్‌లో ట్రిపుల్‌ఐటీ విద్యార్థులతో మంత్రి కేటీఆర్

- ట్రిపుల్‌ఐటీ విద్యార్థులకు మంత్రి కేటీఆర్ సూచన

భైంసా: నిజామాబాద్ ఐటీహబ్‌లో కేటాయించిన వర్క్‌స్పేస్‌ను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర మంత్రి కేటీఆర్ బాసర ట్రిపుల్‌ఐటీ విద్యార్థులకు సూచించారు. బుధవారం నిజామాబాద్‌లో ఐటీహబ్‌ను అందులోని గ్రౌండ్‌ఫ్లోర్‌లో బాసర ట్రిపుల్‌ఐటీకి కేటాయించిన వర్క్‌స్పేస్‌ను వీసీ వెంకటరమణతో కలిసి మంత్రి ప్రారంభించారు. ట్రిపుల్‌ఐటీలో విద్యార్థులు తయారు చేసిన కొన్ని వర్కింగ్ మోడల్స్‌ను అందులో ప్రదర్శించగా తిలకించారు. అనంతరం ట్రిపుల్‌ఐటీ విద్యార్థులతో మాట్లాడారు. ట్రిపుల్‌ఐటీ వర్క్‌స్పేస్‌కు పూర్తిస్థాయి సహకారాన్ని అందిస్తానని మంత్రి కేటీఆర్ తెలిపారు. మరింత కష్టపడి వర్క్‌స్పేస్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అధ్యాపకులు సారిక, రవికాంత్, హరిబాబు, డాక్టర్ వినోద్, అసోసియేట్ డీన్ సృజన, రంజిత్, సుజయ్, రాకేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్మీ జవాన్ సేవలు దేశానికి అంకితం

- ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు


మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

నేరడిగొండ(బోథ్): ఆర్మీ జవాన్ సుధాకర్ తన సేవలను దేశానికి అంకితం చేశాడని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు, జెడ్పీటీసీ అనిల్ జాదవ్ అన్నారు. ఆదివారం జమ్ములో గుండెపోటుతో మృతి చెందిన మండలంలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ సుధాకర్ అంత్యక్రియలను బుధవారం స్వగ్రామంలో నిర్వహించారు. ఎమ్మెల్యే బాపురావు హాజరై మృతదేహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో తెలంగాణ లెక్చరర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్, కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ నాయకులు ఆడె గజేందర్, అప్పీల్ స్వచ్ఛంద సంస్థ ప్రధాన కార్యదర్శి రాథోడ్ పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థి మృతదేహం అప్పగింత


రోదిస్తున్న ట్రిపుల్ ఐటీ విద్యార్థి తల్లిదండ్రులు

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్ ఐటీలో పీయూసీ ప్రథమ సంవత్సరం విద్యార్థి జాదవ్ బబ్లూ మృతదేహాన్ని బుధవారం తల్లిదండ్రులు జాదవ్ సంతోష్, రుక్మిణిలకు అప్పగించారు. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం నాగాపూర్‌కు చెందిన బబ్లూ హాస్టల్ గదిలో మంగళవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకోగా బుధవారం నిర్మల్ జిల్లా ఆస్పత్రిలో ఆర్ఎంఓ వేణుగోపాలకృష్ణ పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం పోలీసు బందోబస్తు మధ్య తల్లిదండ్రులకు అప్పగించారు. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల రోదనలు అందరినీ కలిచివేశాయి.

చిరుత సంచారం

నిర్మల్‌టౌన్: పట్టణంలో చిరుత సంచారం భయాందోళనకు గురిచేస్తోంది. మంగళవారం రాత్రి బంగల్‌పేట్ వినాయక సాగర్ చెరువు నుంచి విశ్వనాథ్‌పేటకు వెళ్లే బైపాస్ రోడ్డులో చిరుత రోడ్డు దాటుతుండగా స్థానికులు గమనించినట్లు చెబుతున్నారు. ఈ వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టడంతో ఆ ప్రాంత ప్రజలు భయాందోళన చెందుతున్నారు. దీనిపై ఎఫ్ఆర్ఓ జైపాల్ రెడ్డిని వివరణ కోరగా.. పట్టణ శివారు ప్రాంతంలో అటవీ ప్రాంతం ఉండడంతో చిరుతలు తిరిగే ఆస్కారం ఉంది. కానీ అవి జనాల్లోకి రాకపోవచ్చని, ప్రజలు భయాందోళనలకు గురికావద్దన్నారు.

బ్యాంక్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి


డీడీలు పంపిణీ చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

ఇంద్రవెల్లి: గ్రామీణ ప్రాంత ప్రజలు యూనియన్ బ్యాంక్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ సోయం బాపురావ్, ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖనాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని నూతన భవనంలో ఏర్పాటు చేసిన బ్రాంచ్‌ను ప్రారంభించారు. ట్రైకార్ పథకం ద్వారా మంజూరైన 60 మంది లబ్ధిదారులకు ఎంపీ, ఎమ్మెల్యేల చేతుల మీదుగా డీడీలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీజీఎం భాస్కర్, ఏజీఎం కోటేశ్వర్‌రావ్, ఎంపీపీ పోటే శోభాబాయి, జెడ్పీటీసీ ఆర్క పుష్పలత, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ అంజద్, ఏఎంసీ మాజీ చైర్మన్ జాదవ్ శ్రీరాంనాయక్, సర్పంచ్ కోరెంగా గాంధారి, ఎంపీటీసీ సభ్యులు జాదవ్ స్వర్ణలత, గితే ఆశాబాయి, బ్యాంక్ మేనేజర్ భగత్, తదితరులు పాల్గొన్నారు.

కమల్‌కోట్‌లో సినిమా షూటింగ్


షూటింగ్‌లో పాల్గొన్న హీరో సప్తగిరి

మామడ: మండలంలోని కమల్‌కోట్‌లో బుధవారం పెళ్లికాని ప్రసాద్ సినిమా షూటింగ్ జరిగింది. సినిమాకు సంబంధించిన సన్నివేశాలను గ్రామంలోని బస్టాండ్ ప్రాంతంలో చిత్రీకరించారు. హీరో సప్తగిరి, హీరోయిన్ ప్రియాంకశర్మ సన్నివేశంలో నటించారు. అభిలాష్‌రెడ్డి దర్శకత్వం వహిస్తున్న సినిమాకు కమల్‌కోట్ గ్రామానికి చెందిన సుధీర్ రెడ్డి ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.

పోరాటాలతోనే హక్కుల సాధన

- సీపీఐఎంఎల్ (పీసీసీ) కేంద్ర కమిటీ సభ్యులు దేవప్రదశర్మ


మాట్లాడుతున్న దేవప్రదశర్మ

ఖానాపూర్: ఆదివాసీలు పోరాటల వీరుడు కుమురంభీం స్ఫూర్తితో పోరాటాలు చేసి హక్కులు సాధించుకునే సమయం ఆసన్నమైందని సీపీఐఎంఎల్ (పీసీసీ) కేంద్ర కమిటీ సభ్యులు దేవప్రద శర్మ అన్నారు. బుధవారం మండలంలోని అడవి సారంగాపూర్ పంచాయతీ పరిధిలోని జిల్లెడికుంటలో సీపీఐఎంఎల్ (ప్రజాపంథా) ఆధ్వర్యంలో అంకుశ్‌రావు పటేల్ అధ్యక్షతన నిర్వహించిన సభకు హాజరై మాట్లాడారు. అస్సాంలో బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా ఉద్యమ స్ఫూర్తిని రగిలించి మహోత్తర ఉద్యమానికి తెరలేపిన కుమురంభీంను కన్న తెలంగాణ గడ్డపై కాలుమోపడం ఆనందంగా ఉందన్నారు. దేశంలోని కమ్యూనిస్టు విప్లవ పార్టీలన్నీ ఒకే వేదికపైకి వచ్చి పాలకులు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేఖ విధానాలపై పోరాడాలన్నారు. ఈ క్రమంలోనే సీపీఐఎంల్(పీసీసీ), సీపీఐఎంఎల్(ప్రజాపంథా) పార్టీలు ఒక అవగాహనకు వచ్చాయన్నారు. కార్యక్రమంలో సీపీఎంఎల్పీసీసీ కేంద్ర కమిటీ సభ్యురాలు శాంతనశర్మ, సీపీఐఎంఎల్(ప్రజా పంథా) ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్య, నాయకులు కే.రాజన్న, వెంకట్ మహేంద్ర, లక్ష్మి, సమత, సోనేరావు, లక్ష్మణ్, బలవంత్‌రావు, లచ్చన్న, మంతు, భీంరావు, చందు, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ బిడ్డలను విద్యలో ప్రోత్సహించాలి

- సామాజిక సమరత వేదిక రాష్ట్ర కన్వీనర్ అప్పాల ప్రసాద్


విద్యా సామగ్రి అందజేస్తున్న ప్రసాద్

గుడిహత్నూర్(బోథ్): ఆదివాసీ బిడ్డలు చదువుల్లో రాణించేందుకు అవసరమైన ప్రోత్సాహం అందించాలని సామాజిక సమరత వేదిక రాష్ట్ర కన్వీనర్ అప్పాల ప్రసాద్ అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివాసీ సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఆదివాసీ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే ఆదివాసీ బిడ్డలు ఉన్నత స్థాయికి చేరాలని, ఇది జరగాలంటే వారు బాగా చదువుకోవాలన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన అన్ని ఆశ్రమ పాఠశాలలను పటిష్టం చేస్తూ మెరుగైన విద్య అందించినప్పుడు ఈ కల సాకారం అవుతుందన్నారు. అనంతరం విద్యా సామగ్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సేన సేవా సంఘం వ్యవస్థాపకులు మేస్రం రాజేశ్వర్, హెచ్ఎం అభిమాన్, సిబ్బంది శేషేరావ్, స్థానికులు పస్తాపురే బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

ఒరిస్సా ఆదివాసీ మహాసభకు ఆత్రం సుశీల


మహాసభలో పాల్గొన్న ఆత్రం సుశీల

బోథ్: ఒరిస్సాలోని జర్సీగూడలో జరిగిన ఆదివాసీ మహాసభలో బోథ్ మండలంలోని బాబెర గ్రామానికి చెందిన ఆత్రం సుశీల పాల్గొంది. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా తొమ్మిది రాష్ట్రాల నుంచి ఆదివాసీ ప్రముఖులు హాజరుకాగా గతంలో గవర్నర్ చేతుల మీదుగా స్వచ్ఛ అవార్డు అందుకున్న ఆత్రం సుశీలకు ఆహ్వానం అందింది. సభలో తెలంగాణలో ఆదివాసీల ఆచార వ్యవహారాలు, స్థితి గతులను వివరించారు.

ఐదుగురిపై పిచ్చికుక్కల దాడి


గాయాలపాలైన సతీశ్

బజార్‌హత్నూర్(బోథ్): మండల కేంద్రంలో పిచ్చికుక్కల స్వైర విహారంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. బుధవారం ఒకేరోజు ఐదుగురు కుక్క కాటుకు గురయ్యారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందారు. అందులో ఏడాది పాప అంబెపాడు సమేక్షను ఇంటి ముందు నుంచి నోట కరిచి లాక్కెళ్ళాయి. వెంటనే తల్లి గమనించి పాపను గట్టిగా లాగడంతో పాప చేతికి గాయాలయ్యాయి. కదం సతీష్, ఆదేష్, గోవింద్, పరమేశ్వర్‌లకు తీవ్ర గాయాలయ్యాయి.



భారీ వర్షాల అనంతరం మొదలైన 'కళ్ల కలకలు' జిల్లా అంతటా వ్యాపిస్తోంది. కళ్లు ఎరుపెక్కడం, నిరంతరాయంగా నీరు కారడం, కళ్లు మంటమండడం, తల బరువెక్కడం, నిద్రపట్టకపోవడం వంటి సమస్యలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులకు కళ్లకలక రావడంతో ఇలా కళ్లజోళ్లతో పాఠశాలకు హాజరయ్యారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి


సంఘటనా స్థలంలో మృతదేహం

గుడిహత్నూర్(బోథ్): మండలంలోని జాతీయ రహదారి 44పై చింతగూడ క్రాస్‌రోడ్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందినట్లు ఎస్సై ఇమ్రాన్ తెలిపారు. ఇచ్చోడ మండలం నవేగాంకు చెందిన షేక్ సద్దాం (32) ఇచ్చోడలో మొబైల్ షాపు నడుపుతున్నాడు. బుధవారం వ్యాపార నిమిత్తం బైక్‌పై ఇచ్చోడ నుంచి ఆదిలాబాద్ వెళ్తుండగా వెనుక నుంచి బైక్‌పై వచ్చిన ఇస్రుగూడకు చెందిన దేవన్న ఢీకొట్టడంతో సద్దాం అక్కడికక్కడే మృతి చెందాడు. దేవన్నను రిమ్స్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

మామడ: మండల కేంద్రంలోని రహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని పొన్కల్ గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు గాయపడ్డారు. గ్రామానికి చెందిన అరుణ్, ఫహీం, సాయితరుణ్ పొన్కల్ నుండి నిర్మల్‌కు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా బైక్ అదుపు తప్పి కిందపడడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించారు.

కలప పట్టివేత


కలపతో పట్టుబడిన కారు

ఉట్నూర్‌రూరల్: మండలంలోని దంతన్‌పల్లి సమీపంలో ఘన్‌పూర్ చౌరస్తా వద్ద బుధవారం కలప తరలిస్తున్న కారును పట్టుకున్నట్లు ఎఫ్ఆర్‌వో గు లాం మొయినొద్దీన్ తెలిపారు. ముందస్తు సమాచా రం మేరకు కారును వెంబడించగా డ్రైవర్ కారును వదిలి పరారయ్యాడన్నారు. కారులో రూ.30వేల వి లువైన రెండు టేకు దుంగలు లభ్యమయ్యాయన్నా రు. కలప, కారును స్వాధీనం చేసుకుని బీర్సాయిపేట రేంజ్‌కు తరలించారు. కార్యక్రమంలో డెప్యూటీ ఎఫ్ఆర్‌వో ప్రియాంక, బీట్ అధికారులు ప్రతాప్, గులాబ్‌సింగ్, అజయ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరుగురిపై కేసు నమోదు

ఆదిలాబాద్‌రూరల్: మద్యం మత్తులో పరస్పరం దాడికి పాల్పడ్డ ఇరువర్గాలకు చెందిన ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు మావల ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. మావల పోలీసు స్టేషన్ పరిధిలోని దస్నాపూర్‌లో గల ఓ వైన్స్‌షాపు ఎదుట ఆరుగురు ఒకరిపై ఒకరు దాడికి పాల్పడ్డారు. గొడవకు దిగి ప్రజా శాంతికి భంగం కలిగించడంతో వారిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. అరెస్టయిన వారిలో అస్లమ్ ఖాన్, షేక్ అజర్, షేక్ ఆరీఫ్, నజర్ ఖాన్, షేక్ అన్వర్, షేక్ రియాజ్ ఉన్నారు.

మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్య

కుభీర్(ముధోల్): మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఎండీ షరీఫ్ తెలిపారు. మండలంలోని నిగ్వా గ్రామానికి చెందిన దత్తాత్రి (51)కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరు లేని సమయంలో మద్యం మత్తులో పురుగుల మందు తాగి మృతి చెందాడు. గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుని భార్య సంగీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసిన భార్య

- అచ్చులాపూర్‌లో ఘటన


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

తాండూర్(బెల్లంపల్లి): వివాహేతర సంబంధం ఒకరి ఉసురు తీసింది. కట్టుకున్న భార్య ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసింది. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం తాండూర్ మండలం అచ్చులాపూర్‌కు చెందిన సిద్దం శ్రీనివాస్ (40), బానక్క దంపతులు కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కొంతకాలం క్రితం ఐబీ తాండూర్‌కు వెళ్లి తిరిగి స్వగ్రామం వచ్చారు. ఐబీ తాండూర్‌కు వెళ్లిన సమయంలో తాండూర్‌కు చెందిన మేడి శంకర్‌తో బానక్కకు వివాహేతర సంబంధం ఏర్పడింది. విషయం శ్రీనివాస్‌కు తెలియడంతో మద్యానికి బానిసయ్యాడు. పద్ధతి మార్చుకోవాలని కుటుంబ సభ్యులు కోరినా ఆమెలో మార్పురాలేదు. దీనిపై దంపతుల మధ్య తరచూ గొడవ జరుగుతుండేది. మంగళవారం కూలిపనులకు వెళ్లిన శ్రీనివాస్ ఇంటికి రాలేదు. రాత్రి 9:30 గంటల ప్రాంతంలో అచ్చులాపూర్‌కు చెందిన కట్ల శివకుమార్ మృతుని కుమారుడు సాయికి ఫోన్‌చేసి గోపాల్‌నగర్ క్రాస్‌రోడ్ పక్కన మద్యం సేవించి పడిఉన్నట్లు తెలిపాడు. బుధవారం ఉదయం గోపాల్‌నగర్ శివారు ప్రాంతం మల్లన్న గుట్ట వద్ద శ్రీనివాస్ మృతి చెంది కనిపించాడు. మృతుని తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టగా హత్యోదంతం వెలుగులోకి వచ్చింది. తమ అక్రమ సంబంధానికి అడ్డు వస్తున్నాడని ప్రియుడు శంకర్, బానక్క కలిసి హత్య చేసినట్లు వివరించారు. ఎవరికీ అనుమానం రాకుండా బురద గుంటలో మృతదేహాన్ని పడేసినట్లు తెలిపారు. మృతునికి తల్లి, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఘటనాస్థలిని బెల్లంపల్లి ఏసీపీ పంతాటి సదయ్య, తాండూర్, కన్నెపల్లి, మాదారం ఎస్సైలు రాజశేఖర్, నరేష్, రాజశేఖర్ పరిశీలించారు. మృతుని తల్లి సిద్దం మొండక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య

లక్సెట్టిపేట(మంచిర్యాల): ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం మున్సిపాలిటీ పరిధిలోని గంపలపల్లి గ్రామం ఆంధ్రాకాలనీకి చెందిన మహేష్ (20) వ్యసనాలకు అలవాటుపడి ఖాళీగా తిరుగుతున్నాడు. మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుని తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని, మృతికి సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉందని ఎస్సై పేర్కొన్నారు.